మధుకర్ ఆ పేరు వింటూనే ఉలిక్కిపడ్డాడు--ఒకింతసేపటికి తేరుకున్నాడు.

"సర్ మొదట ..... నా పెట్రోల్‌బంక్ జాబ్‌కి రిజైన్ చెయ్యాలి. అప్పుడే యిందులో నేను జాయిన్ అయినట్టు లెక్క. లేకపోతే ఇటీజ్ ఇల్లీగల్.".

"యూ ఆర్ కరెక్ట్. సెల్ఫ్ పాలసీలుండడం చాలా అవసరం. ఒ.కే. ఐ విల్ గో ..... నౌ దారిలో నిన్ను డ్రాప్ చేసి వెళతా."

ఏమనలేదు మధుకర్.

తన తండ్రి రాఘవేంద్రనాయుడు గురించి ఆలోచిస్తున్నాడు. సుమదేవ్ తన తండ్రి ఫ్రెండా! అంటే ఇన్‌డైరెక్టుగా తన తండ్రి గ్రూప్‌లోనే పడ్డాడా తను? రాక రాక వచ్చిన అవకాశాన్ని వదులుకోవాలా! వద్దా!

తండ్రి ప్రమేయం లేకుండా తన ప్రతిభతో సంపాదించుకున్న ఉద్యోగం యిది! కారులో వెళుతున్న మధుకర్ అన్యమనస్కంగా వున్నాడు.

సడన్‌గా మధుకర్ అలా గ్లూమీగా అయిపోవడంతో, మధుకర్ మనస్తత్వాన్ని అంచనా వెయ్యడానికి ప్రయత్నించసాగాడు సుమదేవ్.

* * * *

భువనగిరి బస్టాండ్‌లో బస్సుదిగింది మహతి. అప్పటికి సమయం రాత్రి ఎనిమిది గంటలయింది. అదే సమయంలో --

రఘురామ్‌శెట్టి యింట్లో--

"చూడండి శెట్టిగారూ. మీరు పెద్ద బిజినెస్‌మేన్ అని తెలుసు.

లక్ష లక్షలు సంపాదించారనీతెలుసు. కాలం కల్సిరాలేదని తెలుసు. అయినా ఈ సంబంధం ఎందుకు ఒప్పుకున్నారు. మీ మంచితనంవల్ల. ఎంత మంచితనమైనా, మనం ఆలోచించాల్సింది మన పిల్లలగురించి అవునంటారా కాదంటారా .....

అడిగినంత కట్నం యివ్వలేనన్నారు. సర్దుకుంటానన్నాను ..... మీమీద అభిమానంతో పెళ్ళి ఖర్చులూ పెట్టుకుంటామన్నాను ..... కానీ ..... లాంచనాల విషయంలో మాత్రం, మీరు మరో మాటంటే, కుదరదండి. మన కట్నం ఎంత పుచ్చుకున్నాం, ఎంత ఇచ్చుకున్నామన్నది ఇవాళ ఎవరికీ అక్కర్లేదు ..... మనం ఎంత చెప్తే అంత అనుకుంటారు అవునా కాదా ..... ?

నలుగురూ వచ్చే పోయే ఇంట్లో, ఒక కలర్ టి.వి, వి.సి.పి, ఏదో డబుల్ బెడ్ ..... ఏదో ఒక సోఫా ..... మిక్సరూ ..... కుర్రాడికి ఒక స్కూటరూ ..... ఇవ్వి కూడా లేకపోతే ఎలాగండి ..... చెప్పండి ..... అల్లుడి ప్రెస్టేజంటే, మీ ప్రెస్టేజ్ కాదూ ..... మీ అమ్మాయికే కదా ఆ గౌరవం" ఆ మాటలంటున వియ్యంకుడి ముఖంవేపు ముభావంగా చూస్తున్నాడు రఘురామశెట్టి.

నెమ్మదిగా ఆయన పెదవి విప్పాడు.

"ఇన్ని చెప్పాక ..... మీరు మళ్ళీ మొదటికే వస్తే ఎలా బావగారూ, మొదట్నుంచి నేను మీకు తెలుసు ..... ఆ కాలంలోనే ..... పెద్దమ్మాయి పెళ్ళిని అయిదు లక్షలతో జరిపించాను ..... రెండో అమ్మాయి పెళ్ళి ఎలా జరిగిందో మీకు తెలుసు.

ప్రస్తుతం ఈ ఇల్లు తాకట్టుపెట్టి, ఈ పెళ్ళి చేస్తున్న విషయం మీకు తెలుసు ..... అన్నీ తెల్సిన మీరే ..... " ఎంతో మందిచేత గౌరవించబడే తన తండ్రి అలా ప్రాధేయపడడటం మొట్టమొదటిసారి చూస్తోంది ఇరవై మూడేళ్ళ కళ్యాణి.

"లాభం లేదండి శెట్టిగారూ ..... నేనొప్పుకున్నా, ఇంట్లో ఒప్పుకోవడం లేదు ..... రేపుదయం ఆరుగంటలకల్లా మీరే విషయం చెప్పండి" వియ్యంకుడు లేచి నిలబడ్డాడు.

అదే సమయంలో ఆ ఇంటి ముందు రిక్షాలోంచి దిగింది మహతి. లోనికొస్తూ ఆ సంభాషణను వింది.

"మీరలా అంటే ..... ఎలాగండి ..... ఒక్క నెలరోజులు ..... టైమివ్వండి ..... ఆ లాంఛనాలన్నీ ఇస్తాను ..... యాభై వేలు కాదు ..... లక్ష రూపాయలిస్తాను ..... "

"యాభై వేలకు దిక్కు లేదుగానీ.. లక్ష రూపాయలు ఎలా తెస్తారండి ..... ఆ తర్వాత మీరూ మేమూ దెబ్బలాడుకోవడం, మీ అమ్మాయి మా ఇంటికి రావడం ..... పెద్దమనుషులు మా ఇంటికి రావడం ..... ఎందుకండీ ఆ గొడవలన్నీ ..... రేపుదయం వరకూ గడువు ..... లేకపోతే ..... రేపుదయం ..... పెళ్ళికొడుకుని చెయ్యడమూ లేదు ..... రేపు రాత్రి పెళ్ళిలేదు ..... " ముందు కడుగేసాడు వియ్యంకుడు.

కళ్యాణి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఆ ప్రక్కన నిల్చున్న రఘురామశెట్టి భార్య కృంగిపోయింది. రఘురామశెట్టి మొఖం పాలిపోయింది.

"అయ్యా! సీతారామ్‌గారూ ..... ఒక్కసారి ..... ఒక్కసారి నా కళ్ళల్లోకి చూడండి" అని ప్రాధేయపడుతున్న శెట్టి మాటల్ని విన్పించుకోకుండా, ముందుకుడుగేసిన వియ్యంకుడు, ఎదురుగా మహతిని చూసి, "ఒక్క నిమిషం ఆగండి" అన్న ఆమె మాటను విని ఆగిపోయాడు.

మహతి గబగబా నడుచుకుంటూ రఘురామశెట్టి దగ్గరకెళ్ళి--

"మీరేం బాధపడకండి. డబ్బు నేను తెచ్చాను" అంటూ హేండ్ బాగ్‌లోంచి అయిదు కట్టల్ని తీసి ఆయనకు అందించింది.

మహతివేపు, ఆమె ఇచ్చిన నోట్లకట్టలవేపు విస్మయంగా చూసాడు రఘురామశెట్టి.

ఆపైన నీళ్ళు నిండిన కళ్ళతో మహతివేపు చూసాడాయన.

వెనకడుగేసిన వియ్యంకుడు, మారిన మొఖంతో చూస్తూ నిలబడ్డాడు. మరో మాట మాట్లాడకుండా రఘురామశెట్టి, ఆ డబ్బుని వియ్యంకుని చేతిలో పెట్టాడు.

"చెప్పేరు కారేం ..... ఏర్పాటు చేశానని ..... ఒక గంటలోనో, ఘడియలోనో డబ్బు చేతి కందుతుందని చెప్తే ..... మీ ముల్లేం పోతుంది బావగారూ ..... " ముఖమ్మీద నవ్వుని పులుముకుంటూ అన్నాడు వియ్యంకుడు.

రఘురామశెట్టి ఆనందోద్వేగం నుంచి ఇంకా తేరుకోలేదు. అందుకే ఆయన

మాట్లాడలేదు.

"ఓ.కే.బావగారూ ..... అనుకున్నవన్నీ అనుకున్నట్లు అన్నీ జరిగిపోతాయి ..... రేపుదయం ..... " ఏదో చెప్పబోతున్న వియ్యంకుడు, తనవేపే వస్తున్న కాబోయే కోడలు కళ్యాణిని చూస్తూ ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు.

గదిలోంచి విసురుగా వచ్చిన కళ్యాణి, కాబోయే మామగారి చేతుల్లోంచి ఆ డబ్బుని తీసుకుని తండ్రి చేతిలో పెట్టి--

"నాకు మీ అబ్బాయంటే ..... ఇష్టంలేదు ..... రేపు ఆ పెళ్ళి జరగదు. వెళ్ళండి ..... ఇంకో విషయం ..... రేపు ఆరుగంటల లోపల మీరు తీసుకున్న కట్నం మొత్తం, తిరిగిచ్చెయ్యండి ..... లేకపోతే పోలీస్ కంప్లయింట్ ఇవ్వాల్సి వస్తుంది ..... గుర్తుంచుకోండి."

అమాయకంగా కనబడే కళ్యాణి నోటివెంట, అలాంటి మాట వస్తుందని అక్కడెవరూ ఊహించలేదు "అమ్మా ..... కళ్యాణీ ..... " ఏదో అనబోయాడు తండ్రి.

"నన్ను క్షమించండి నాన్నా ..... ఈ సమయంలో నేనింతకంటే ఎక్కువ చెప్పలేను ..... ఇవాళ మీ పరువు వాళ్ళకు ముఖ్యం కానప్పుడు, రేపు నా ప్రాణం కూడా వాళ్ళకు ముఖ్యం కాదు ..... రేపు నేను శవంగా మారకుండా ఉండాలంటే, ఇవాళ నేను చెప్పినట్టుగా చెయ్యండి ..... అంతే ..... " అని

పెళ్ళికొడుకు తండ్రివేపు తిరిగి --

"చూడండి ..... పెళ్ళికొడుకు తండ్రిగారూ .....కట్నం సొమ్ము తిరిగివ్వడానికి రేపుదయం ఆరుగంటల వరకూ టైమిస్తున్నాను ..... గుర్తుంచుకోండి ..... ఇక మీరు వెళ్ళొచ్చు" ఆ మాట అనేసి గబ గబా లోనికెళ్ళి పోయింది కళ్యాణి.

"అంతేనా ..... బావగారూ ..... " వియ్యంకుడి మాటకు ఏమీ జవాబివ్వలేదు రఘురామశెట్టి-- వియ్యంకుడు తలదించుకుని బయటికెళ్ళి పోయాడు. తన కూతురు అలాంటి గొప్ప నిర్ణయాన్ని తీసుకొనగలిగే స్థాయికి ఎదిగినందుకు ఎంతో ఆనందంగా

ఉంది ఆయనకు. అయిదు నిమిషాల సేపు మనిషి కాలేకపోయాడు రఘురామశెట్టి తర్వాత

"కూర్చోమ్మా" అని మాత్రం అనగలిగాడు.

ఒక వర్షం వెలిసిపోయినట్టుగా ఉంది మహతికి. ఆ అమ్మాయి అలాంటి నిర్ణయం తీసుకోవడం ఆమెక్కూడా నచ్చింది.

"బేబీ ..... తీసుకున్న నిర్ణయం మంచిదేనంటావా అమ్మా ..... " నెమ్మదిగా అడిగాడు సంశయంగా.

"ఇటీస్ ఎ గుడ్ డెసిషన్ సర్."

"ఎక్కడ తెచ్చావో, ఎలా తెచ్చావో సమయానికి నువ్వు దేవతలా వచ్చావ్ ..... నువ్వు డబ్బు ఇచ్చినందుకైనా, పెళ్ళి జరిగిపోతే ..... "

"పెళ్ళి గురించి వదిలెయ్యండి బాబాయిగారూ ..... ఈ సంబంధం తప్పిపోవడం మన మంచికేనేమో ..... "

"ఆ డబ్బెక్కడిదమ్మా ..... "

"మీదే ..... సర్ ..... "

ఆ మాటకు అప్రతిభుడయ్యాడు రఘురామశెట్టి.

"మీ డబ్బే సర్ ..... మీ దగ్గర్నించి పట్టుకెళ్ళిన మీ జన్నీ క్లాత్ ద్వారా వచ్చిందే సర్ ..... "

"జన్నీ క్లాత్‌ని కొన్నారా ..... ?" ఆయన కళ్ళల్లో మరింత ఆశ్చర్యం తొంగిచూసింది. దాంతోపాటు ఆనందంతో కళ్ళు మెరిసాయి.

"అవున్సార్ ..... "

“ఎలా సేల్ చేసావ్ ..... ” ఆత్రంగా అడిగాడాయన.

“అదే బిజినెస్ రహస్యం. మీ దగ్గర స్టోర్‌రూమ్‌లో పడున్న ఆరుకోట్ల రూపాయల క్లాత్‌ని అమ్మేక, ఆ విషయం చెప్తాను సర్ ..... అంతవరకూ నన్నేం అడక్కండి ..... ”

“ఆరు కోట్ల రూపాయల సరుకునీ అమ్మేస్తావా?!”

“ఎస్ ..... సర్ ..... ఈ క్లాత్ సేల్స్ కాదు ..... మళ్ళీ మీరు ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తారు ..... ఈ ప్రొడక్టుని ప్రొడ్యూస్ చేస్తారు ..... ఈ ముక్కిపోయిన ఆరుకోట్ల రూపాయల క్లాత్ మనకు, కోట్ల రూపాయల ప్రాఫిట్‌కు ఆధారమౌతుంది. ఒక ఆరునెలల టైమ్‌లో జన్నీ క్లాత్ నేమ్ ఇండియాలో మారుమోగిపోతుంది. మనం ఈ క్లాత్‌ని ఎక్స్‌పోర్ట్ చేస్తాంసర్. మూతపడ్డ జన్నీ ఫాబ్రిక్స్ ఫ్యాక్టరీ కోట్ల రూపాయల వ్యాపారాన్ని చేస్తుంది” ఆవేశంగా చెప్పింది మహతి.

“ఇంత కాన్ఫిడెన్స్ నీకెలా వచ్చిందమ్మా ..... ” ఎక్సైటేట్‌మెంట్‌కి గురవుతూ అడిగాడాయన.

ఒక్క నిమిషం తటపటాయించి లేచి, అయన కాళ్ళను కళ్ళకద్దుకుని--

“మీరిచ్చింది సర్ ..... ”

చితికిపోయి, ఓడిపోయి ఎన్నెన్నో అవమానాలను ఎదుర్కొంటున్న తను, తన కుటుంబం రోడ్డున పడకుండా కాపాడమని ప్రతిరోజూ ఎన్నెన్నో దేవుళ్ళకు మొక్కుకుంటున్నాడాయన. ఇన్నాళ్ళకు మహతి రూపంలో తనను అదృష్టం వరిస్తోందా? తన కుటుంబం రోడ్డున పడదు ..... మళ్ళీ తన పూర్వ వైభవం తనకు వచ్చేస్తోంది. తన కష్టానికి ప్రతిఫలం, తన ఆలోచనలకు ప్రతిఫలం ..... ఇన్నాళ్ళకు ..... ఇన్నేళ్ళకు .....

ఆనందంతో ఆయన తడిసి ముద్దయిపోయాడు. గబుక్కున లేచి మహతిని అక్కున చేర్చుకున్నాడు.

"లక్ష్మీ ….. " ఆ పిలుపుకు, మళ్ళీ ఏం జరిగిందోనని పరుగు- పరుగున వంట గదిలోంచి బయటకొచ్చింది రఘురామశెట్టి భార్య.

"లక్ష్మీ ….. పూజగదిలోనున్న పట్టుచీరను తీసుకొస్తావా ….. " ఆవిడ గబుక్కున పూజ గదిలోకెళ్ళి, ఆ పట్టుచీరను పట్టుకొచ్చింది.

"ఇది ….. నేను స్వయంగా నేసిన పట్టుచీరమ్మా ….. నా కుటుంబం రోడ్డుపాలు కాకుండా చెయ్యమని ప్రార్థిస్తూ, ఆ దేవ దేవికి పెట్టుకున్న చీర ….. ఇంత మంచి వార్తను చెప్పిన నీకు ….. ఈ సమయంలో నేనివ్వగలిగే ఏకైక కానుక ఇదేనమ్మా ….. ఇదే ….. నువ్వు ఆ దేవదేవీనేనమ్మా" తడిచేరిన కళ్ళతో. ఆ చీరను మహతి చేతిలోపెడుతూ అన్నాడు రఘురామశెట్టి. కళ్యాణి వచ్చి నుదుట బొట్టు పెట్టింది.

ఆ తర్వాత భోజనాలయ్యాక ---

తన పథకాన్ని చెప్పింది మహతి.

"ప్రస్తుతానికి మనకో యాభై స్టిచ్చింగ్ మిషన్‌లు కావాలి ….. చెప్పింది చెప్పినట్టుగా కుట్టగలిగే దర్జీలు కావాలి ….. జన్నీ ఫాబ్రిక్స్ షోరూంని నేను హైదరాబాద్‌లో ఏర్పాటుచేస్తాను. ఇక్కడ అజమాయిషీ అంతా కళ్యాణికి అప్పగించండి ….. మీరూ, నాతోపాటు హైదరాబాద్ రండి" చెప్పింది మహతి.

"ఒకేసారి యాభై స్టిచ్చింగ్ మిషన్లంటే ….. " ఆలోచనలో పడ్డాడు రఘురామశెట్టి.

"మనం కట్నంకోసం ఇచ్చిన డబ్బు వాడు రేపుదయం తెచ్చిస్తాడు కదా" ప్రక్కనే వున్న కళ్యాణి అంది.

"ఈ గొప్ప సంఘటన జరగడం కోసమా ….. పెళ్ళి తప్పిపోయింది" తనలో తను అనుకున్నట్టుగా అన్నాడు రఘురామశెట్టి.

మర్నాడుదయం--

జన్నీ ఫ్యాబ్రిక్ మిల్స్‌లో మనుషులు తిరగడం ప్రారంభమైంది. గోడౌన్‌లోంచి క్లాతంతా బయటకొచ్చింది. స్వయంగా రఘురామశెట్టి, ఆయన భార్యలక్ష్మి, కళ్యాణి, మహతి ఆ క్లాత్‌ని శుభ్రం చెయ్యడం ప్రారంభించారు. కొంతమంది మనుషుల్ని కూడా ఏర్పాటుచేశాడు రఘురామశెట్టి.

ఆ రోజు సాయంత్రం--

వియ్యంకుడు ముఖం మాడ్చుకుని కట్నంగా తీసుకున్న లక్ష రూపాయల్ని తెచ్చిచ్చేసాడు. అక్కడ పనుల్ని కళ్యాణికి అప్పగించి--

రఘురామశెట్టి, మహతి హైదరాబాద్ బయలుదేరారు.

* * * *

యధాప్రకారం చిక్కడపల్లి హోటల్లో దిగాడు రఘురామశెట్టి. తన రూమ్ నుంచి ఉదయం ఎనిమిది గంటలకల్లా వచ్చేసింది మహతి.

“నన్నేం చెయ్యమంటావ్ ..... ” అడిగాడు రఘురామశెట్టి.

“ఒక డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ అద్దెకు సంపాదించండి ..... నేను సాయంత్రం మళ్ళీ అయిదుగంటలకొస్తాను.”

“నేను ఇక్కడుండడానికి ఫ్లాట్ అఖ్కర్లేదేమో నమ్మా ..... ” అనుమానంగా అన్నాడాయన.

“ఫ్లాట్ మీక్కాదు సర్ ..... ముందు వెతకండి ..... తర్వాత ఎందుకో చెప్తాను.” వచ్చేసింది మహతి.

* * * *

స్టిచ్‌వెల్‌లోకి అడుగుపెట్టిన మహతిని చూడగానే “నువ్వేదో సెన్సేషన్ క్రియేట్ చేస్తావని ఎప్పుడో ఊహించాను కానీ ..... యింత త్వరలో క్రియేట్ చేస్తావని అనుకోలేదు ..... జన్నీ ఫ్యాబ్రిక్స్‌ని ఇంట్రడ్యూస్ చేసావట కదా ..... నిన్న ఈవెనింగ్ మీ యూనివర్శిటీ స్టూడెంట్సట ..... వరసగా వస్తూనే వున్నారు ..... స్టాఫందరూ వెళ్ళిపోయారు ..... వాళ్ళకి నేనొక్కదాన్నే దొరికి-పోయాననుకో ..... అసలేమిటీ కథ ..... ” అడిగింది వనజాక్షి.

చెప్పింది మహతి.

"నిజంగా ఫారిన్ క్లాతా అది. కాదుగదా ..... మరి ఇంత క్రేజ్ ఎలా వచ్చింది?"

"అది ఫారిన్ క్లాత్ కాదు ..... గానీ లేటెస్ట్ ఫారిన్ డిజైనింగ్ వుంది. క్రేజ్‌కి కారణం అంటారా ..... ఇనీషియల్‌గా టార్గెట్ గ్రూప్‌కి వెళ్ళడానికి చిన్న మాజిక్ చేశా" నవ్వుతూ అంది మహతి. ఆపైన మహతి తన సంభాషణని కొనసాగిస్తూ--

జన్నీ ఫాబ్రిక్స్ పునరుద్ధరణ, రఘురామశెట్టిని హైదరాబాద్ తీసుకురావడం, మిగతా ప్లాన్స్ క్లుప్తంగా చెప్పింది. ఆమె చెపుతున్నంత సేపూ కళ్ళార్పకుండా చూస్తూ వింది వనజాక్షి-- అంతా విన్నాక ఆమె ఒకే ఒక మాట అంది.

"జన్నీ ఫాబ్రిక్స్ మిల్స్‌ను ఓపెన్ చేయిస్తున్నదా ..... నిజం ..... ? ఇక్కడ షోరూంని ఏర్పాటు చేయిస్తున్నావా? అయితే ఇక్కడ మానేస్తున్నావన్న మాట ..... " ఆ చివరి మాటను ఆవిడ చాలా బాధగా అంది.

"కాదు మేడమ్ ..... జన్నీ మిల్స్ తరపున సగం వర్క్ మీకే వస్తుంది ..... మిగతా సగం మెటీరియల్ భువనగిరిలో తయారౌతుంది.." మహతి చెప్పింది.

"యూ ఆర్ సో బ్రిలియంట్ మహతి ..... చాలా మంది ..... బ్రిలియన్స్ వుంటుంది. కానీ ధైర్య సాహసాలుండవు ..... కానీ ..... కొన్ని నెలల టైమ్‌లో నువ్వు చేస్తున్న అద్భుతాలు ..... "

"అంతగా పొగడకండి మాడమ్ ..... స్వతహాగా నేను చాలా బద్ధకస్తురాలిని ..... పెద్దలు సంపాదించి దానికి ఖర్చుచెయ్యడం తప్ప, సినిమాలకు షోకులకు తగలెయ్యడం తప్ప, చాలాకాలం బాధ్యత తెలీని దాన్ని ..... ఒక లక్ష్యంకోసం నేను మారాల్సి వచ్చింది. ఆ గమ్యాన్ని నేను చేరుకోవాలంటే కాలం, నేనూ ఒకటి కావాలి ..... అందుకే ఈ పరుగు ....."

మహతి మాటలు అర్థంకాలేదు వనజాక్షికి.

"ఎనీహౌ ..... టైమీజ్ యువర్స్ నౌ ..... గో ఎహెడ్ ..... " ప్రశంసాపూర్వకంగా అందామె. ఆ రోజు సాయంత్రం --- మహతి రాకకోసం టెన్షన్‌గా ఎదురుచూస్తున్నాడు రఘురామశెట్టి. దూరం నుంచి మహతి కన్పించగానే తనే ఎదురెళ్ళాడు.

"కాలేజీ లైన్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ దొరికిందమ్మా ..... " ఉత్సాహంగా చెప్పాడాయన.

మొట్టమొదటిసారి చూసినప్పుడు రఘురామశెట్టి, ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం కన్పించింది. ఆ వ్యత్యాసం చాలా ఆనందాన్ని కకిగించిందామెలో.

"పదండి ..... ఆ ఫ్లాట్ చూసొద్దాం ..... "